# ఆకు పచ్చని మాయ

పొద్దు నడిమింటికి ఎగబాకుతూ వుండగా పొలం దగ్గరున్న బావి కట్టమీది వేపచెట్టు కిందికి చేరుకున్నాడు రామయ్య.

మచ్చు కత్తిని చెట్టు మొదలుకు చేర్చి, మెడమీద చుంగు వేలాడేలా తలకు చుట్టుకున్న తుండు గుడ్డను విప్పి ఓసారి విదిల్చి మొహం తుడుచుకున్నాడు. చెట్టు మొదట్లోని మట్టి దుత్తమీది మూత తొలగించి, దుత్త పైకెత్తి చల్లని నీళ్ళు కడుపార తృప్తిగా తాగాడు.

చెట్టు బోదెకు అనించి పరచిన అరుగులాంటి బండరాతిమీద కూచుని పొట్ట జేబులోని బీడీ తీసి ముట్టించుకున్నాడు. పొగ వదలుతూ వుండగా ఆలోచించుకున్నాడు. పొగ వదలుతూ వుండగా ఆలోచనలు వచ్చి మెదడును కమ్ముకున్నాయి.

పొద్దున సద్దినీళ్ళు తాగేటప్పుడు భార్య చెప్పిన మాటలు గుండెల్లో దూరి ఇప్పటిదాకా కెలుకుతూనే వున్నాయి. పని సందడిలో మరుగయినా, ఊరకుంటే మాత్రం వెంటనే వచ్చి మూగుతున్నాయి.

"వానికి తలకు పట్టింది. మంచీ చెడ్డా తెలీడం లేదు. రామరామరామ... ఉప్పుగల్లాల ఎగిరిపడ్తాండే.. నిన్ను కాకల్లు సేతులు ఇరగొట్టి మంచంలో పడేస్పాడంట. అంత ఎక్కనపడేట్టు ఎందుకుంటావబ్బా. వానిట్టమొచ్చినట్టు సేసుకొనీ... అడ్డపడగాకు. రామ రామ వాని తీరే మారింది" చెప్పింది.

తనేం కానిపని చేశాడనీ – వాడంత కసిగా మాట్లాడ్డానికి? 'చెడు సావాసాలూ... చెడుదావలూ... చెడు అలవాట్లూ.. చెడిపాయె నా కొడుకు. ఉట్టికీ సొర్గానికీ ఎక్కకుండా పాయె' అనుకున్నాడు.

వరుసగా నాలుగు రోజులుగా చూస్తున్నాడు వాడి కళ్ళల్లో ఏమాత్రం తగ్గని ఆ ఉడుకు.

స్కూలు ఫీజు, వ్యాను ఫీజు కట్టేంతదాకా ఎక్కించుకుపోయేది లేదంటూ ఇంగ్లీషు మీడియం స్కూలు వ్యాను పిల్లలిద్దర్నీ వదిలేసిపోయినప్పటి నుంచి మరింత ఉక్రోషంతో ఊగిపోతూ వున్నాడు.

మొదటి రెండ్రోజులూ ఎవరెవరికో ఫోన్లు చేయడం, మోటార్ సైకిల్మీద బుర్రుబుర్రున తిరిగిరావడం...

ఎక్కడా అప్పు పుట్టనట్టుంది.

పిల్లలు ఇంటివద్దే వున్నారు.

బీడీ దమ్ములాగి బూడిద నుసిరాల్చుతోండగా "సెట్లు నరుక్కోనీయగూడదంటనే మామా!" అంటూ నసుగుతూ ముల్లుగర్ర చేతబట్టుకొని పడుతూ లేస్తూ నీడకొచ్చాడు పుల్లగూర సుబ్బన్న.

తలెత్తి అతనికేసి ఎగాదిగా చూశాడు రామయ్య.

దుత్తలో నీళ్ళుతాగి, ఎదురుగా గొంతుక్కూ చుంటూ, జేబులో చెయ్యిపెట్టి చాలాసేపు వెతికి ఒక బీడీతీసి "అగ్గిమరి..." అని అడిగాడు సుబ్బన్న.

అయిష్టంగానే దమ్ములాగి ఇక వీడు వదిలేలా లేడని బీడీ అందించాడు రామయ్య.

రగులుతూ వున్న బీడీ ముక్కతో తన బీడీ అంటించుకొని తిరిగి ఇస్తూ, "అతగాడు ఏడుస్తాండడే పాపం! పిల్లోల్ల బడి పీజులకు లెక్కలేదంటా, పురుగు మందులకూ లెక్కలేదంటా.. పాస్పేటుకు లేదంటా. బో ఇబ్బందుల్లో ఉండాడంట. అబ్బునివి నువ్వు కనికెరం జూపకుంటే ఎవురు జూపాల?" అన్నాడు.

చివుక్కున్న అతనికేసి తలెత్తి చూశాడు రామయ్య. "అయితే ఏందోయ్ నువ్వనేది?" అన్నాడు - చివరి కంటా కాలిన బీడీని చెట్టుబోదెకేసి నలుపుతూ.

"అతగాడు చెట్లు అమ్మితే నువ్వు కుదరదన్నె వంటనే... నరకనీయలేదంటనే"

"అవునోయ్! నరకనియ్యను. వాడు మొలిపించి సాకిండా నరకడానికి? ఎ సెట్టుకు ఎన్ని కొమ్మలుండేది, అవి ఏ దిక్కుకు సాగిందీ, ఏ కొమ్మలు దండిగా కాసేదీ వానికేమన్నా ఎరికేనా, అమ్మడానికి? ఇయ్యాల సెట్లమ్ముతడు, రేపు చేలమ్ముతడు. మొన్నాడు ముసిలోల్లం మమ్మల్నీ అమ్ముతడు. అయినా నీడనిచ్చే సెట్టునరికి అమ్మడమేందోయ్? సిగ్గెడలేదు నా కొడుక్కు రాయ బారంపంపిండు... రాయబారం. అయినా నీకేడ సిగ్గులేదోయ్ నాయాల ఈ మాట సెప్పడానికి? గోసి ఎగ బట్టుకొని అంతదూరాన్నించి గసపోసుకుంటా ఈడికొచ్చినవే. ఈ రోంతనీడ వుండబట్టిగాదూ. ఈనీడలో దోసెడు నీల్లుండ బట్టిగాదూ! మద్దెస్తం జెయ్యనొచ్చినవే సిగ్గు లేన్నాయాలా?" విదిలించి పారేశాడు.

"సోమీ సోమీ! ఏదో ఆ నాయాలు ఏడుస్తాంటే వొచ్చిన్లే.. నీ కొడుకేగాదు. అందరూ అదే తీరుగా వుండార్లే. కాలమట్టుంది. ఏంజెయ్యాల? పొలాల్లో ఎట్టాన్నాయె కల్లాల్లో సెట్లుగూడా అమ్మబట్టిరి" అంటూ మెల్లిగా లేచి అక్కణ్ణించి కదిలాడు. వెనుకనించి ఇంకా ఏవేవో గొణుగుతూనే వున్నాడు రామయ్య.

పొద్దున్నే మేకలోల్ల రమణ కూడా ఇదే పంచాయితీ తెచ్చాడు. వాడు ఒకడుగు ముందుకేసి, అమ్మిన సరుకులో భాగం కూడా తీసికొమ్మన్నాడు. వాన్ని కొట్టినంత పన్జేశాడు తను.

అందరివద్దా మొరపెట్టుకొన్నట్టుంది తన సుపుత్రుడు. వాని ఏడుపు చూసి వీళ్ళు తనవద్దకొచ్చారు.

'వాని ఏడుపంత విలువజెయ్యవా ఈ చెట్లపానాలు?' బాధగా తనలో తాను అనుకొన్నాడు.

లేచి తను కూచున్న వేపచెట్టునూ, పక్కనున్న జడల దెయ్యంలాంటి చింతచెట్టును, వంకదరినున్న రకరకాల చెట్లను చాలాసేపు చూస్తుండిపోయాడు.

'ఊరిలో ఇల్లూ, పొలంలో చెట్టేగదా మనిషికి నీడ' అనుకున్నాడు తనకి తాను సర్దిచెప్పుకొన్నట్లు.

రోజులో సగంకంటే ఎక్కువకాలం పొలంలో గడిపే రైతుకు చెట్టేగదా బైటి ఇల్లు.

చెట్టు మొదట్లో అరుగుబండా, పక్కనే నీల్లదుత్తా, కొమ్మకు వేలాడగట్టిన సద్దిమూటా, పంగల్లో మడిచి పెట్టిన గోనెపట్టా, రాయీరప్పా లేకుండా శుభ్రంగా వుంచిన నీడవాలే నేలా... తనకిది ఇల్లేకదా! అలిసి పోయేదాకా పన్జేసి వచ్చి ఈ నీడన నడుంవాల్చితే ఎంతహాయిగా వుంటుందనీ!

ఈ చెట్లనీడా, రెమ్మలగాలీ, కొమ్మల్లోని పక్షుల అరుపులూ... ఇవన్నీ వానికి, తన కొడుకు రాఘవకు... వాడేగాదు, వానితోటి పోరంబోకులందరికీ ఎందుకు అందంగా కన్పించవు? ఎందుకు హాయినివ్వవు?

ఆలోచిస్తూ వుండిపోయాడు.

మోటారు వేద్దామనుకుంటే ఇంకా కరంటు రాలేదు. మెల్లిగా వంక గట్టుకు నడిచాడు.

పొద్దున్నించి తను చేసిన పనికేసి చూశాడు. చేలోకి పెరిగి వచ్చిన కంపమండలన్నిట్నీ నరికి వెనక్కివంచే సరికి వంకవార గనిమమీద మనిషి స్వేచ్ఛగా తిరిగేందుకు చక్కని వీలుకుదిరింది.

తను సాగుచేసే ఎకరా చేనిమేర మాత్రమే కాకుండా కొడుకు పాలి మూడెకరాల చేని గనిమ మీద కూడా తనే పన్జేశాడు. ఇవన్నీ వానికి పట్టవు.

రేపట మాపట పైరు ఎదుగుదల చూసుకొందామని లేదు. వారానికొకసారి కూడా చేలకేసి రాడు.

చేనినిండా నిన్న ఇవాళ బైటకొచ్చిన మొక్కజొన్న మొలకలు మట్టి బోదెల చాటున్నించి తొంగితొంగి చూస్తున్నాయి. మనిషి అలికిడి కాగానే చేలోంచి వెనుదిరిగి ఆగమేఘాలమీద పరుగెత్తుకొచ్చి వంకగట్టు మీది చెట్ల. మొదళ్ళను కరచుకొని సరసర పైకెగబాకుతున్నాయి చిట్టిపొట్టి ఉడతలు.

మట్టిపెల్ల అందుకొని చేని చివరిదాకా విసరుతూ అదిలించాడు. మరికొన్ని ఉడతలు పారిపోయాయి.

చేలోకి అడుగుపెట్టి బాగా వంగి మొక్కల్ని ఒకసారి జాగ్రత్తగా పరిశీలించాడు.

ఎక్కడో బారెడుకొక మొలకను, అదీ ఓవైపు ఆకును మాత్రమే కొరికినట్టున్నాయి ఉడతలు.

దానికే ఎంత రాద్ధాంతం చేస్తున్నారనీ కంపెనీవాళ్లు. పైరంతట్నీ ఉడతలు కొరికేస్తున్నాయని గగ్గోలు.

క్రాసింగ్ సీడ్ ఇచ్చిన కంపెనీ, టన్ను కంకులు పదివేల రూపాయల వంతున రైతులవద్ద అగ్రిమెంటు చేసికొంది. దాంతో ఒక్క మొక్క రాలిపోయినా దానివల్ల కలిగే నష్టాన్ని గోరంతలు కొండంతలు చేసి రైతుల్ని భయపెడుతోంది. కంపెనీవాళ్ళ సూచన మేరకు గెనిమలంతటా ఫోరేట్ గుళికలు చల్లారు రైతులు.

ఆ విషపు వాసనకు ఉడతలు చేలోకి రాకుంటాయని నమ్మకం. కానీ ఫోరేట్ వాసనని కూడా ఉడతలు లెక్క జేయటం లేదుట. దాటుకు వెళ్ళి మొక్కల్ని మరింత మురిపెంగా కొరుకుతున్నాయిట.

ఉన్నట్టుండి తలమీదుగా ఝుమ్మరుమంటూ విమానం మోత విన్పించేసరికి పైకి చూశాడు. ఆహోరు నెమ్మదిగా కదలుతూ, దానికో నల్లని పల్చని మేఘం లాంటి ఆకారం కన్పిస్తూ, అది తేనెటీగల గుంపుగా అర్థమయ్యే లోపల కొన్ని ఈగలు తన శరీరాన్ని తాకుతూ వెళుతోంటే – వింతగా అన్పించింది.

కళ్ళు దించుతోంటే – దూరంగా బంగారు రంగు పూతతో కందిచేలు. వాటిపక్క కాలిదారివెంట వేగంగా వస్తోన్న ఒక మనిషి.

అతనెవరో అర్థమై నొసలు చిట్లిస్తూ బోరుబావికేసి తలతిప్పాడు. కరెంటు స్తంభానికి వేలాడగట్టిన బల్బు ఎందుకో వెలగడం లేదు.

మడవకు కాకుండా మరెందుకొస్తున్నట్లు?
తనమీద గొడవపడటానికి కాదుగదా!
అంత తెగువ చేస్తాడని తననుకోవడం లేదు.
అయినా ఎందుకో గుండెల్లో ఒక్కసారిగా సన్నని పదరు మొదలైంది రామయ్యకు
నేరుగా చేనిగట్టుతొక్కిన రాఘవ, మొక్కజొన్న మొలకల్ని పరీక్షిస్తూ నడిగనిమ మీదుగా బోరువద్దకు చేరుకొన్నాడు. స్టార్టర్ వద్ద చేయిపెట్టి చూసి, వరిపైరును తదేకంగా పరిశీలించి అక్కడ తన పనేమీ లేదనుకొని కడగనిమ మీదుగా వెనుదిరిగి వెళ్ళాడు.
వచ్చినంతసేపు పట్టలేదు వెళ్లటానికి.
తండ్రికేసి తలెత్తికూడా చూడలేదు.
మొక్కజొన్న మొలకలపైన ఉడతలు దాడిచేసే వంక వారుగనిమ మీద అడుగు కూడా పెట్టలేదు.
"ఈని బతుకింతే..." అనుకొన్నాడు రామయ్య తేలిగ్గా. తీరిక సమయాన్ని పైరువద్దా, చెట్లవద్దా గడుపుదామని ఏ మాత్రం లేదు.
ఎప్పుడూ టౌనుకు పోవటమో, వీధుల్లో తిరగటమో, టీవీల ముందో పేకాటవద్దనో పొద్దుబుచ్చు కోవటమో తప్ప రైతుగా బతికే అలవాటు ఒక్కనికి కూడాలేదు.
విత్తనాలు నాటింతర్వాత చేని మొహం చూసేదిలేదు. ఇంటిదగ్గర కరంటుబల్బు వెలిగినప్పుడు ఉరుకుల పరుగుల మీద చేలవద్దకు చేరుకోవటం. మోటారు ఆడించటం, మడవ తిప్పటం, కరంటు పోగానే ఇంటికి పరుగెత్తటం.
చెట్లకింద కూచునే తీరిక ఎక్కడుంది వీళ్ళకు? చేతిలో సెల్‌ఫోన్లు వాళ్ళను ఒకచోట నిలబడనిస్తాయా! కాళ్ళకింది మోటార్‌సైకిళ్ళు ఊర్లో వుండనిస్తాయా?
ఇక చెట్లమీదా, పొలంమీదా, ప్రకృతిమీదా వాళ్లకు మర్లు ఎందుకు పుడుతుంది?
ఆలోచనల్లో వుండగానే బర్రెగొడ్ల కాలిగిట్టల చప్పుడు విన్పించింది వంక గట్టుమీంచి. "యే...యేబ్బ... యేయే" అంటూ వెనకే ఆడమనిషి గొంతు... బర్రెలు నీళ్ళ గుండాల్లోకి దిగిన సవ్వడి.
"ఒక గెడ్డమీంద నిలబడక.. ఒక మెతకలో మూతిబెట్టక రామరామరామ... తిప్పితిప్పి సంపెనే ఈ గొడ్లు" అంటూ చంకలో పేడతట్ట.చేతిలో తుంట కట్టెతో వంకలోంచి ఎక్కివచ్చింది రామయ్య భార్య శేషమ్మ.
"వాడొచ్చిండంటనే ఈడికి...?" దగ్గరగా వచ్చి భర్త ముఖంలోకి చూస్తూ ప్రశ్నించింది.
"ఊ..." ఔనన్నట్లుగా మూలిగాడు.
"రామరామరామ... ఏమన్లేదు గదూ! కొట్లాల్లేదు గదూ!" అతన్ని పైన్నించి కిందిగాకా చూసి "యమ్మ యమ్మ..." అంటూ గుండెలమీద చేయి వేసికొంది.
ఆదుర్దాతో కూడిన ఆమె ప్రశ్నలు, ఆరాటాలు, తడబాట్లు అతన్ని కొంత కదిలించాయి.
బల్బు వెలిగినట్లుగా అన్పించి వెళ్ళిస్టార్టర్ స్విచ్ నొక్కాడు. పంపులోంచి నీళ్ళు దూకుతూ వుంటే కొడుకు వరిమడి మీదకే మడవ తిప్పాడు. దుత్తలో నీళ్ళు పారబోసి కొత్తనీళ్ళు నింపిపెట్టాడు.

కొమ్మకు కట్టిన సద్దిమూట విప్పి తనుకొంత తిని మిగిలింది భార్యకు ఇచ్చాడు. వంక గట్టున చెట్టుకింద కూచుని బీడీ ముట్టించుకున్నాడు.

అడపాదడపా చెట్లమీది ఉడతలు కిందకు దిగి గనిమ మీద అటుఇటు తచ్చాడుతూ రామయ్య బెదిరింపులకు భయపడి తిరిగి చెట్లెక్కుతున్నాయి.

చెట్లమీది చిలుకల కిరకిరనాదాలు, వంకనీళ్ళలో నీటి కోళ్ళ అరుపులూ, గుండంలోని బర్రెల కదలికల నీటి సవ్వడులూ, గుండంలోని బర్రెల కదలికల నీటి సవ్వడులూ, బయలంతా ఊపిరి బిగబట్టిన మధ్యాహ్నకాల పకృతి వంకదరిన మాత్రం సన్నగా కూనిరాగాలు తీస్తూ వుంది.

ఆ సవ్వడుల్లోంచే ఏవో గొంతుకలు.. ఇటుగా వస్తోన్న కలగాపులగపు మాటలు... కళ్ళు తెరిచి నిటారుగా అయి చూశాడు.

కంపపొదల చాటున్నించి చేని గనిమ మీదకు వచ్చారు దాదాపు పదిమందిదాకా మనుషులు.

తనకొడుకుతోటి చుట్టుపక్కల చేలవాళ్ళూ, మరోఇద్దరు కొత్తవాళ్ళూ, మొక్కజొన్న మొలకల్ని పరిశీలిస్తూ వస్తున్నారు. కొత్త మనుషులు ఎవరో వెంటనే అర్థమయ్యింది రామయ్యకు.

తనున్న గనిమ మీదకు వచ్చారు వాళ్ళు.

"నిన్న ఇవాళ వచ్చిన మొలకలు కాబట్టి ఈచేలో ఉడతల తాకిడి తక్కువగానే వుంది" కంపెనీ మనిషి అన్నాడు. తమ చేలల్లో ఉడతల దాడి గురించి వాపోయారు రైతులు అందరూ.

"ఫోరేట్ చల్లినా కేర్ చేయలేదంటే - ఇట్స్ సీరియస్ మేటర్. నోడౌట్" అంటూ సాలోచనగా ఒకసారి అందరి కేసి కనుబొమలు చిట్లించి చూసి-

"నేను చెప్పిన పనిచేయగలరా?" అక్కడున్న అందర్నీ అడిగాడు సీడ్ కంపెనీ మనిషి.

"చేస్తాం సార్!"

రింగవుతోన్న సెల్‌ఫోన్లను ఎత్తకుండా ఆపేసి మరీ అతనికేసి చూడసాగారు కొందరు యువరైతులు.

కంపెనీ మనిషి అప్పుడు నోరెత్తాడు. "ఏమీ లేదు... సింపుల్‌గా వేరు శనగపప్పుల పొడిగానీ, స్వీట్‌గానీ తెచ్చి...ఎలుకల మందువుంది చూశారు దాన్ని కలిపి గనిమల మీద అక్కడక్కడా పెట్టండి"

అందరూ నిశ్శబ్దమై పోయారు.

"చచ్చిపోవా సార్?" ఓర్రైతు అడిగాడు తేరుకొని.

అందరి మొహాలూ జాగ్రత్తగా పరిశీలించి చూస్తూ "చస్తాయి.. ఎలుకల్ని చంపటం లేదా మనం? సేం ప్రాసెస్... సేం క్రీచర్స్. పంటల్ని రక్షించుకోవాలి గదా! తప్పదు" అన్నాడు.

సర్రున తలతిప్పి అతనిమొహంలోకి ఒకసారి తదేకంగా చూశాడు రామయ్య.

కొంతసేపు రైతులెవరూ మాట్లాడలేదు.

తర్వాత ఒకరొకరుగా సర్దుబాటయ్యారు.

"ఏం పెద్దయానా! ఇదేగదా సరైన పద్ధతి?" రామయ్యను అడిగాడు.

"ఎందుకు సారూ! వాటిని సంపి పాపం మూటగట్టుకునేది. మనిషి కావిలుంటే ఎడతారాదు గదా." వెంటనే చెప్పాడు రామయ్య.

ఆయన దగ్గరగా వెళ్ళాడు కంపెనీ మనిషి. "ప్రతిచేని వద్దా ఓ మనిషి. ఒకరోజు కాదు రెండ్రోజులు కాదు పదిరోజులు... ఎంత మేన్‌పవర్ వేస్ట్! మనకా తీరికుండదు. లేబర్ దొరకాలంటే కష్టం"

"పదిరోజులు సేనికాదుండేంత తీరిగ్గూడా లేదేమో ఈ పోరంబోకు నాయాన్లకు.." వాళ్ళదగ్గర చిన్నగా గొణిగాడు రామయ్య.

"ఎనీహౌ ఈరోజే ఎలకల మందు పెట్టండి. పెద్దాయనా! నువ్వు కూడా. ఏదోకటి చేసి పైరును కాపాడుకోవాలయ్యా తప్పదు!"

"నేను మందుపెట్టను సారూ!" వెంటనే చెప్పాడు రామయ్య.

కంపెనీ మనిషి బిత్తరపోయి చూశాడు.

ఏదో చెప్పబోయాడు.

"నువ్వెన్నయినా చెప్పుసారూ! ఉడతల్ను నేనుసంపలేను. నాకు సేతులాడవు. ఈ పంట లేకుంటే మాని, నేనా పన్జేయలేను" అన్నాడు దృఢంగా.

తండ్రికేసి తీక్షణంగా చూశాడు రాఘవ.

రామయ్య ఒక చాదస్తపు ముసలాడిగా కంపెనీ వాళ్ళకు అర్థమయ్యాడు.

"తాతల కాలపునాటి వ్యవసాయ పద్ధతులు ఇప్పుడు పనికిరావు పెద్దాయనా! మనం మారాల. మన ఆలోచనలు మార్చుకోవాల. ఎకరాకు ముప్పై వేల రూపాయల ఇన్‌కమ్ తెచ్చే సీడ్ ఇచ్చినం. దాన్ని కాపాడుకోవాల. పొలంగట్టుమీద ఈ చెట్లేంది? ఈ పొదలేమిటి? ఇదంతా క్లీన్ చేయాల. చేనుగట్టున ఇట్లాంటి వేస్టంతా వుంటేనే ఉడుతలు వచ్చేది. చిలుకలు దాడిజేసేది. వీటి వేర్లన్నీ పైరుకు వేసిన సత్తువంతా లాగేసుకొంటాయి. చెట్లు పెంచటం నీకంత ఇష్టంగా వుంటే నాలుగెకరాలు సపరేట్‌గా నాటుకో. అవికూడా మామిడి, నిమ్మ, టేకు లాంటి ఇన్‌కమ్ ఇచ్చే చెట్లు నాటుకో" చెప్పాడు.

రాఘవ కళ్ళల్లో వెలుగు కనబడింది. తను చెట్లు నరికించటమనేది వ్యవసాయానికి ఉపయోగకరమైందిగా తేలటంతో బలం వచ్చినట్లయింది.

"ఉడతల్ని చంపాల్సిందే. ఎలుకల్ని చంపాల్సిందే, చిలుకల్ని తరమాల్సిందే, చెట్లు నరికి గనిమల్ని క్లీన్ చేసుకోవాల్సిందే ఇవన్నీ చేస్తేనే మీరు బాగుపడేది".

కంపెనీ మనుషుల్ని చూస్తోంటే ఒళ్ళంతా కంపరంగా అన్పించింది రామయ్యకు. మొహంమీద గొంగలి పురుగులు పాకినంత జలదరింపు కలిగింది.

"మీ బాగువద్దు. మీ ఆదాయం వొద్దులేసారూ! పొద్దున్నే కాడిగట్టి గుంటకతోలుతా. మీ పైరుకూడా వొద్దులే" చెబుతూ తుండుగుడ్డ తలకు చుట్టుకొని మచ్చుగత్తి చేతికి తీసికొన్నాడు.

రాఘవ కళ్ళల్లో కోపం బుసబుస పొంగింది.

"ఏం మనిషివయ్యా నువ్వు! ఇంత మూర్ఖంగా ఆలోచిస్తే ఎట్లా? మీ ముసలితరం పోతేగానీ ఈ తరం బాగుపడదు" సీరియస్‌కంపెనీ మనిషి మొహం చిట్లించుకున్నాడు.

చర్రునమండింది రామయ్యకు.

"ఏం మనిసివి సారూ నువ్వు!" ఈసడింపుగా అన్నాడు. "ఉడతల్ను సంపమంటావ్. సెట్లను నరకమంటావ్. ఏం మాసివి సార్? దూడను సంపి పాలన్నీ పిండుకోవాలనే రకానివిగద సార్! ఉడత తినక, ఎలక తినక, పిట్టతినక, గొడ్డూ

గోదా, చీమా దోమా తినకపండించినయన్నీ నువ్వే తిందామనుకొన్నెవా? ఇది రైతు పద్ధతి కాదు సార్! రైతులకు వచ్చే ఆలోసెన కాదుసార్! పోపో పోండియ్యా" అంటూ విసురుగా అక్కణ్ణించి కదిలిపోయాడు.

"ఏమయ్యా! ఏంజేస్తావ్ మరి?" రాఘవకేసి తదేకంగా చూశాడు కంపెనీ మనిషి.

అప్పటికే రాఘవ కోపంతో ఊగిపోతున్నాడు.

"ఈ ముసిల్నాకొడుకుతో సస్తాందసార్! దేనికీ అడ్డ పడ్తాందు. ఈన్ని కాళ్లిరగ్గొట్టి మంచంలో పడేస్తేగాని నేను బతకలేను. నిలబడు నా కొడకా" అంటూ వంగి రాతికోసం వెంపర్లాడి, రాయిదొరక్క చేతికందిన మట్టి పెల్లను తీసి తండ్రికేసి బలంగా విసిరాడు.

అది రామయ్య కాళ్ళదగ్గరగా పడి ముక్కలు ముక్కలైంది. వాళ్ళు వీళ్ళు పట్టుకోబోయే లోపలే – వెనుదిరిగి చూస్తోన్న తండ్రిపైకి పిచ్చిపట్టిన వాడిలా దూసుకెళుతూ మళ్ళీ రాతికోసం వంగాడు రాఘవ.

ఈసారి బలమైన రాయే చేతికి దొరికింది.

తండ్రికేసి క్రూరంగా చూశాడు.

"రామరామరామ... సంపెనాయినో... అబ్బా కొడకలకు తన్లాట పెట్టిరిగదర నా బట్టల్లారా! నిలబడుకోసూస్తాందరు గదరా మీకు గత్తరదగలా" అంటూ వాళ్ళ దగ్గరకు పరుగెత్తుకొచ్చింది శేషమ్మ.

"రా నా కొడక... కొట్టుమరి... ఈన్నే పొలిజేస్తా నా కొడక..." చేతిలోని మచ్చుగత్తిని పైకెత్తి కొడుకుకేసి చూసి బలంగా ఊపాడు రామయ్య.

ఈలోపు అందరూ వచ్చి రాఘవను వెనక్కులాక్కు పోయారు. మగనిముందు నిలబడి గొంతు చించుకొని శోకాలు పెడుతోంది శేషమ్మ.

కంపెనీ వాళ్ళనూ, తోడొచ్చిన వాళ్ళనూ బండబూతులు తిట్టసాగింది.

అందరూ వెళ్ళిపోగానే నిస్సత్తువగా కుంకుడుచెట్టు మొదలుకు ఆనుకొని గొంతుక్కూచుని బీడీ ముట్టించుకున్నాడు రామయ్య. శేషమ్మ ఏడుస్తూనే వుంది.

తన ఉత్తముడైన కొడుకును చెడగొట్టిన అతని సావాసగాళ్ల మీద దుమ్మెత్తిపోస్తూ వుంది.

ఓ గంట గడిచి వుంటుంది.

హఠాత్తుగా కొడుకు గొంతు విన్పించి ఉలికిపాటుగా అటుకేసి చూశారు ఇద్దరూ.

"ఇయ్యాల నీ సంగతి అటోఇటో తేల్చుకోవాల..." అడుగులు తడబడుతోండగా దూసుకొస్తున్నాడు రాఘవ.

లబలబమని మొత్తుకొంటూ కొడుక్కి ఎదురెళ్ళి ఒక్కసారిగా నడుము కరుచుకొంది శేషమ్మ.

"నువ్వుతీ మా... వాడో నేనో మిగలాల" బలంగా విదిలించుకొంటున్నాడు రాఘవ.

అతనివద్ద సారాయి వాసన గుప్పుమంటోంది.

"తాగి అబ్బనిమీందికి కలబడ్డానికొస్తాందవా? నాశినమైపోతావురా నాకొడకా!" అంటూ అతన్ని గట్టిగా నిలవరించింది శేషమ్మ.

"నిన్న మొన్నటిదాకా నిన్ను భుజాలమీంచి దించకుండా సాకెగదరా! ఆ మాత్రం కనికెరం లేదా?" ఏడుస్తూ కొడుకు గడ్డం పట్టుకొంది.

"అయప్ప తన కొడుకును భుజాలమీంద కూకోబెట్టి సాకిండు. నేను నా కొడకల్ను వ్యాన్‌లో ఎక్కోబెట్టి బడికి పంపలేకుండా. నాదొకబతుకు... థూ.... ఈ బాద తట్టుకోలేకనే సారాయి తాగుతాండా" గింజుకొని గింజుకొని అతని కోపం కాస్త ఏడుపులోకి మారింది.

చేయడానికి ఏమీ తోచక కొడుకుకేసే తదేకంగా చూస్తూండిపోయాడు రామయ్య.

★ ★ ★

రాత్రి తొమ్మిది గంటలు కావొస్తోంది.

అప్పటికే చలి మొదలైంది.

వీధరుగు మీద యవ్వారం జేస్తోన్న మనుషులంతా ఒక్కొక్కరే ఇళ్ళకు జారుకొన్నారు.

వీదంతా నిశ్శబ్దంగా వుంది.

కొట్టంముందు నిల్చుని బీడీ చివరిదమ్ము లాగుతూ మిద్దెకేసి చూశాడు రామయ్య.

లోపలినుంచి టీ.వీ.రొదలేదుగాని లైటుమాత్రం వెలుగుతోంది. ఇప్పటికే రెండుసార్లు అత్తవద్దకు వచ్చి ఏడ్చిపోయిందట కోడలు.

నేరుగా మిద్దె పంచలోకి వెళ్ళాడు. తలుపుమీద చేయి వేయగానే అది తెరుచుకొంది. ఆ కొద్ది చప్పుడుకే మంచమ్మీంచి లేచింది కోడలు.

"వాడింగా రాలేదుగదమ్మే?" అంటూ ఆమెను పలకరించి లోపలికి నడిచాడు.

మంచానికి దూరంగా జరిగి గోడవారగా ఒదిగి నిల్చుని 'కూకోమామా!' అంది భయం భయంగా.

"రోజూ తాగే వస్తాడు గదా!"

సమాధానం చెప్పలేదు ఆమె.

"ఎంతబాగా నేర్చుకొన్నేవమ్మే! ఎంతమంచి తీరు బడి తీర్చినవూ? మొగుడు ఏ జాముకాడన్నా రానీ - ఇంతసేపు ఏం జేస్తాన్నెవు అని అడిగేది లే... తాగి సగం బొద్దునరానీ- 'నీకిదేంపని' అని నిలదీసేది లే. మేలు కొని మరీ కూడు బెడ్తాండవు. అంటే... ఇంగా తాగి రమ్మనేగదా! బాగనే మరుపుకొంటాండవు. బాగనే సాకుతుండావు" అన్నాడు.

మామ మాటలకు తలెత్తి కూడా చూడలేదు ఆమె. వలవల ఏడవటం మొదలెట్టింది. పైటగుడ్డ నోటికి అడ్డంచుకొని కళ్ళనీళ్ళు జలజల కార్చసాగింది.

ఆమెకేసి తదేకంగా చూశాడు రామయ్య.

"నాకందుకే కోపమొచ్చేది" గయ్‌మన్నాడు.

"ఏడ్చేదెందుకమ్మే దిక్కులేనిదాన్లా? నోరు తెరిస్తేనేం? మూగిదానివా.. నేనిన్ని మాటలంటావుంటే నువ్వొక్కమాట ఎదురుజెప్పలేవా? చిన్నప్పట్నించీ మీరు తీర్చిన తీరుబడితోనే మీ కొడుకు పోరంబోకయ్యిండు. తప్పంతా మీదేనని అన్లేవా? మాటకు మాట ఎదురియ్యలేవా? ఎన్ని రోజులని నోర్మూసుకొని వుంటావమ్మే? మడవకు నువ్వే పోతాంటివి. కలుపులు నువ్వే తీస్తాం టివి. కోతలు నువ్వే కోస్తాంటివి.

పంటంతా వాడు అమ్మక తింటాంటే - మోటార్ సైకిల్‌కూ, సెవిలో ఫోనుకూ, తాగుడుకూ, తిరుగుడుకూ వాని వాతగొట్టుకుంటాంటే మూగెద్దాల సూస్తాంటివి. ఏడుస్తాంటివి. తిండిమాని మరీ శోకిస్తివి. బుద్ధిలేదు నీకు. ఎందుకమ్మే ఏడ్చేది? కడుపునిండా తిను. కండలరిగేట్లు పన్జేయి. అవసరమైతే నోరంతా ఎత్తి కొట్లాడు.

కట్టేదంటే మెట్టేదను. ఒసే అంటే ఒరే అను. ముండా అంటే నాబట్టా అను... బతికినన్నాల్లూ నోరుమూసుకొని పడుంటే సంసారం నాశినమయిద్దిమ్మే! ఇయ్యాల వాడు చెట్లమ్ముతడు. రేపు పొలాలమ్ముతడు. మొన్నాడు పిల్లోల్లిద్దరికి చెరొక బొచ్చె చేతికిచ్చి అడుక్కోపొమ్మంటడు. నువ్వు నోరు తెరవకుంటే నీ పిల్లోల్లు ఇంటింటికి పోయి 'మాదాకబలం' అని నోరు తెరిసి అడుక్కోవాల. వానికెందుకమ్మే ఆ మోటరు సైకిలు? అది సంసారాన్ని ఎంత నాశినం జేసిందో నీకు తెల్దా? నువ్వు గట్టిగా నిలబడకుంటే సంసారం సేతికి దొరకదమ్మే! నీకేం బయం లేదు. నీ ఎనక మేముండాం.

మనం ముగ్గరం ఒకటైతే వాడు దారికిరాక మానడు. చెట్లనుగాదు, ముందు ఆ దరిద్రపు మోటార్ సైకిల్ అమ్మి ఖర్చులు బూడ్చుకోమను.

నేనిదే ఆఖరుసారి సెబుతాండ... సంసారం నీది.

బతుకు నీది. బంగారంటి పిల్లోల్లుండారు. జాగర్త.." అంటూ వెనుదిరిగాడు.

వెళుతూవున్న మామకేసి తదేకంగా చూసింది ఆమె. వాకిట్లోంచి బైటకొచ్చి మరీ చూసింది.

వాకిలేసి గడియబిగించి లైటార్పి పడుకొంది.

చాలాసేపు నిద్రపట్టలేదు ఆమెకు. ఆలోచిస్తూనే వుండిపోయింది. మనస్సును అంకెకు తెచ్చుకొనేందుకు ప్రయత్నిస్తూనే వుండిపోయింది.

మరో గంటకో, అర్ధరాత్రికో తలుపుల మీద మోగే చప్పుడును పట్టించుకోకుండా వుండేందుకు మనస్సును మరింత గట్టి జేసుకోసాగింది.

● స్వాతి-జూన్ -2009 ●